# తోక తెగిన ఎలుక

## చిలుకూరి దేవపుత్ర

జీవితం అన్నాక అభ్యుదయ భావాలూ, ఆదర్శాలూ వుండకపోతే మనిషికీ, ఇతర ప్రాణికోటికీ తేడా ఏమీ వుండదని వాదించే వాళ్లలో నేనూ ఒకణ్ణి!

అలా అభ్యుదయ భావాలూ, ఆదర్శాలూ లేకుండా బ్రతికే వాళ్లని చూస్తే నాకు బాధ కలుగదుగానీ, జాలి మాత్రం కలుగుతుంటుంది. అలాంటి జాలే నాకు నారాయణరావు మీద కలిగింది.

నారాయణరావు నాకు చిన్ననాటి స్నేహితుడూ కాదు, అలాగని చదువుకునే రోజుల్లో క్లాసుమేటూ కాదు. ఉద్యోగరీత్యా రెవిన్యూ డిపార్టుమెంటుకు సంబంధించిన వాళ్లమంతే! అందులోనూ అతను ఉద్యోగం చేస్తోంది తిరుపతిలో, మరి నేనేమో అనంతపురంలో. అయితే, మేము కలుసుకున్నది మాత్రం మా డిపార్టుమెంటుకు సంబంధించిన 45 రోజుల సర్వే ట్రెయినింగ్‌లోనే- కడపలో వున్న ఆ 45 రోజులూ అతనూ, నేనూ ఒకే గదిలో వుండాల్సి వచ్చింది. మొదటి రోజునే నారాయణ రావు బ్రాహ్మణుడన్న విషయాన్ని జంధ్యం చూసి పసిగట్టాను. అయితే నేను 'స్వకులం' అంటే అభిమానం వీసమాత్రమైనా లేనివాణ్ణి అవడం వల్ల అతనితో నేనా విషయం వెల్లడి చేయలేదు.

నారాయణరావు ప్రతిరోజు తెల్లారుతున్నట్టే లేచి స్నానాలు చేయడాలూ, సంధ్యావందనం చేయడాలు, దేవుడి పటం ముందు ఏవో మంత్రాలు చదువుతూ పూజలు చేయడాలు, నుదుటిమీద కుంకుమ ధరించడాలు ఇవన్నీ నాకు ఎంతో ఎబ్బెట్టుగా తోచేవి. నేను ఏ కృతయుగానికో, ద్వాపర యుగానికో తిరోగమించినట్టూ... మళ్లీ పాత సంప్రదాయాల మధ్య బ్రతుకుతున్నట్టు ఒకటే ఫీలింగు!

ఓ రోజు పొద్దుటే అన్నాను- "నారాయణరావూ! మీరు చూస్తే చాలా అధునాతనంగా కనబడుతారు.. పిలక వక్కటే లేదుకానీ మామూలు సనాతనుడయిన బ్రాహ్మణుడికీ, మీకూ ఏం తేడా కనబడటం లేదు"

అందుకతను సమాధానంగా పల్లయినా కనిపించకుండా ఓ చిరునవ్వు విసిరాడు.

ఏదన్నా ఒక్కమాట బదులు ఇచ్చి వున్నా- మతం గురించీ, దేవుళ్ల గురించీ, మానవాళికి అభ్యుదయ భావాల అవసరం గురించి ఓ గంటన్నరకి తక్కువ కాకుండా అనర్గళంగా ఉపన్యసించి వుందును. అతని చిరునవ్వు నాలో వాదనని అణచివేసింది.

నాకు చిన్నప్పటి నుంచి ఓ అలవాటుంది... ఎవరయినా ప్రత్యేక తరహా మనుషులు కనిపిస్తే వారికి ఓ అడ్డపేరు పెట్టడం. కాలేజీ చదివే రోజుల్లో జియాలజీ లెక్చరర్‌కి 'మాయల ఫకీర్' అనీ, ఫిజిక్స్ లెక్చరర్‌కి 'టినోపాల్' అన్న పేర్లు నేను పెట్టినవే. అప్పట్లో అవి చాలా ప్రచారం పొందాయి. ప్రస్తుతం నారాయణరావుకి 'తోక తెగిన ఎలుక' అన్న పేరును ఖాయం చేశాను. అలాంటి పేరు పెట్టడానికి కారణం- తిలక్ పొయిట్రీయే! సంప్రదాయవాదుల్ని తిలక్ చెండాడుతూ..

"చిన్నమ్మా
వీళ్ళందరూ తోకలు తెగిన ఎలుకలు
కలుగుల్లోంచి బయటికి రాలేరు
లోపల్లోపలే తిరుగుతారు-' అంటాడు.

నారాయణరావు 'తోక తెగిన ఎలుకే" తన సంప్రదాయపు కలుగులోంచి రాలేదు, అతని కాపేరు అప్టగా వుందని శ్రీధర్ మెచ్చుకున్నాడు. శ్రీధర్ మా జిల్లా నుంచీ వచ్చిన నా సహోద్యోగి.

x x x

ఉదయం వేళ ఎనిమిది గంటలకల్లా మాకు పొలం సర్వే చేయడం వుండేది. మేం గొలుసూ, క్రాస్టావు తీసుకొని జట్లు, జట్లుగా ఊరి బయట పొలాల్లోకి వెళ్లేవాళ్లం. పదకొండూ, పన్నెండు గంటల మధ్య వెనక్కి తిరిగి వచ్చేవాళ్లం. మధ్యాహ్నం మూడింటి నుంచీ సర్వే క్లాసులో థియరీ వుండేది. సాయంత్రం ఐదున్నర కల్లా క్లాసు అయిపోగానే ఊరిమీద పడి షికార్లు కొట్టడం, సినిమాలు చూడడం, రాత్రికి ఏ హోటల్లోనో ఇంత తిండి తినేసి రూమ్‌కు చేరుకోవడం... ఇదీ మా నిత్యకృత్యం! అయితే, నారాయణరావు మాత్రం ఎన్నడూ షికార్లకీ, సినిమాలకీ వచ్చేవాడు కాదు. క్లాసు అయిపోగానే తిన్నగా రూమ్ చేరుకోవడం క్లాసులో ఆ రోజు జరిగిన పాఠాన్నీ, లెక్కల్నీ అధ్యయనం చేసేవాడు.. ఏడవుతున్నట్టే దగ్గర్లోనే వున్న బ్రాహ్మణ హోటల్లోకెళ్లి భోజనం చేసి వచ్చేవాడు. నాకు జ్వరంగా వున్న రెండు రోజుల్లో అతన్ని గమనించిన విషయాలివి.

మామూలుగా ఏ డిపార్టులోని ఉద్యోగికయినా సరదాగా జీవితం గడపడం సాధ్యమౌతుందేమో గానీ, మా డిపార్టుమెంటులో సరదా అన్నది అందని మానిపండే! అందుకే- మంచి తరుణం మించిన దొరకదు అన్నంతగా ఇక్కడ మేం బడిపిల్లల్లా ఏ చీకూచింతా లేకుండా కాలం గడుపుతున్నాం. అలా వున్నాం కాబట్టే ఓ పాడుబుద్ధి పుట్టింది. అదేమిటంటే- ఎలాగోలాగు నారాయణ రావుని మాంసాహార హోటల్‌కి తీసికెళ్లి అతన్ని ఓ ఆట పట్టించాలని. ఆ మాటే శ్రీధర్‌తో చెప్పాను. అతను ఎగిరి గంతేశాడు- కొంటె పనులంటే ఎవరి కిష్టముండదు?

x x x

ఆ వేళ నా పుట్టిన రోజు- ఆ సందర్భంగా ఓ మాంచి హోటల్లో శ్రీధర్‌కీ, నారాయణరావుకీ విందు ఇవ్వబోతున్నట్టు ప్రకటించాను నారాయణ రావుతో. 'తోక తెగిన ఎలుక' ఎంతకీ ఒప్పుకోలేదు. అయినా బలవంతం మీద వప్పించాను.

కడపలో ఏ హోటల్ దేనికి సంబంధించిందో తెలీదు కదా మా 'తోక తెగిన ఎలుక'కి! ఓ పెద్ద మాంసాహార హోటల్లోకి ప్రవేశించాం ముగ్గురం.

తీరా అక్కడికెళ్లాక ఖంగుతిన్నాడు గురుడు! ఇబ్బందిగా మొహం పెట్టాడు- విస్తట్లోకి వచ్చిన కోడివేపుళ్లని చూసి. శాకాహారం మినహా మరేమీ తిననని పట్టుపట్టాడు.

"మీరు నాన్‌వెజ్ తినండి.. నన్ను మాత్రం వదిలెయ్యండి ప్లీజ్! నేను మీ పక్కనే కూచుని వెజిటేరియన్ ఫుడ్ తింటాను" అంటూ.

మా శ్రీధర్‌కి కోపం ముంచుకొచ్చేసింది- "మీరేదో బ్రాహ్మడిననుకుంటున్నారేమో... ఇప్పుడు మాంసం తింటున్న మా విశ్వనాథం కూడా బ్రాహ్మడే తెల్సా! అతని అసలు పేరు శ్రీపతుల విశ్వనాథశాస్త్రి.. కులం పేరు చివర వుంచుకోకుండా తన అభ్యుదయ భావాలతో 'శాస్త్రి' అన్నదాన్ని తీసేశాడు" అంటూ శ్రీధర్ అనేసరికి నారాయణరావు అతి మామూలుగా చూశాడు. అతడెంతో ఆశ్చర్యపోతాడనుకున్న నేను దెబ్బతినిపోయాను.

కొంచెంసేపు మౌనంగా వుండి అన్నాడు నారాయణరావు- ''నాకు తెలుసు అతను బ్రాహ్మడని'



"ఎలా తెలుసు పేరు చివర శాస్త్రి లేదుగా" అన్నాడు శ్రీధర్ ఆత్రంగా–

"కులం పేరు తోకలో లేదుగానీ, తలలో వుందిగా! ఒక్క బ్రాహ్మడికి తప్ప 'శ్రీపతుల' అన్న ఇంటిపేరు మరెవ్వరికీ వుండదు.. ఏ మాత్రం ఇంగితం వున్నవాడయినా తెలుసుకోగ లడు !" అంటూనే భోజనం చేయడానికి సిద్ధమ య్యాడు నారాయణరావు.

నేను ఖంగుతిన్నాను– అతని మాటలకి. అతను అలా మాట్లాడకపోయున్నట్టయితే కులాల్ని సూచించే పేర్లు పేరు చివర్లో వుండడం ఎంత అనాగరికమో, ఎంత ఫ్యూడల్ సంస్కృతో వివ రంగా సోదాహరణంగా ఓ చిన్న స్పీచి ఇచ్చేవాడిని.

శ్రీధర్, నేనూ మారు మాటాడకుండా భోజనం చేయడంలో వుండిపోయాం...

నారాయణరావు ఫ్యూడల్ భావాలున్న మనిషి కనుకనే నేను బ్రాహ్మణుడని ముందే తెలిసీ నా రూమ్‌లో వుంటున్నాడు అని తేల్చేసుకున్నాను.

మొత్తం మీద అదిగో... ఇదిగో అన్నంత తొంద రగానే మా ట్రెయినింగ్ అయిపోయింది. పరీక్షలు కూడా రాసేశాం. చివరి రోజున – "ఎప్పుడయినా తిరపతికొస్తే మా ఇంటికి తప్పకుండా రావాలి" అంటూ తన అడ్రసు ఇచ్చాడు నారాయణరావు.

నేనూ అట్లానే అనేసి నా అడ్రసూ ఇచ్చాను.

× × ×

నాకున్న ఇద్దరు చెల్లెళ్ల పెళ్లిళ్లూ చేశాక మా

కుటుంబం బాగా అప్పుల్లో కూరుకుపోయిందనే చెప్పాలి. దాంతో మా అమ్మా నాన్నా దండిగా కట్నం తీసుకునే నా పెళ్ళి చేసేయాలని పట్టుబట్టారు.

అసలే కట్నాలంటే అసహ్యించుకునే నేను – కట్నం తీసుకోవడం నీచమనీ, నేరమనీ, నా వ్యక్తిత్వాన్ని నాశనం చేసుకోవడమేననీ–దానికంటే నేను ఆజన్మబ్రహ్మచారిగా వుండిపోవడం మేలనీ వాదించాను. మీరు మొండిపట్టు పడితే నేనసలు పెళ్ళే చేసుకోను అని బెదిరించాను. చివరికి నాదారికే వాళ్ళు దిగిరాక తప్పలేదు.

"ఎట్లా కట్నం తీసుకోనంటున్నావు కదరా తిరుపతిలో వుండే మీ మామ కుతుర్నన్నా చేసుకో... కట్నం లేకున్నా బంధుత్వమన్నా మిగులుతుంది" అంటూ అమ్మ పాయింటు లేవదీసింది. దానికి నాన్న 'తాళం' వేశాడు.

"నాకు కులమింటి పిల్లే అవసరంలేదు – నేను కులాంతర వివాహం చేసుకుంటాను!" అనిగనక అన్నానంటే మూడో ప్రపంచ యుద్ధం ముంగిట్లోనే జరుగుతుందన్నది నాకు అప్పటికే చాలా స్పష్టం. అందుకే నోరుమూసుకుని వప్పుకున్నాను– ఓ వారంకల్లా అమ్మాయిని చూసి రమ్మన్నారు– 'సరే'నన్నాను – తిరుపతి అనగానే నాకు నారాయణరావు గుర్తొచ్చాడు. 'నేను వచ్చే సోమవారం వచ్చేస్తున్నా' అంటూ ఓ కార్డుముక్క రాసి పడేశాను.

X X Y

ఉదయం ఎనిమిది గంటలవుతోంది–

నేను తిరుపతిలో బస్సు దిగుతుంటే ఎదురుగా నారాయణరావు!

"నేను ఈ బస్సుకేవస్తున్నట్టు ఎలా తెలుసుకున్నావు?" అన్నాను ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ.

"మా మామగార్ని మదనపల్లి బస్సు ఎక్కించాలని వచ్చాను. ఆయన్ని బస్సు ఎక్కించి, ఎంక్వైరీలో విచారించాను–అనంతపురం బస్సు ఎప్పుడు వస్తుందని. ఈ టైముకే వస్తుందని చెప్పారు. ఎందుకయినా మంచిదని వెయిట్ చేస్తున్నా" అన్నాడు నవ్వుతూ. ఈ మూడు నెలల్లో అతను కొద్దిగా లావయ్యాడు. నుదుట బొట్టులో మాత్రం మార్పు లేదు. ఎంతయినా 'తోకతెగిన ఎలుక' కదా!

ఇద్దరం పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ దార్లో అరటిపళ్ళు కొనుక్కుని నడుస్తూనే ఇల్లు చేరుకున్నాం.

బయటి గదిలో నన్ను కూర్చోపెట్టి లోపల కెళ్ళాడతను.

"విశ్వనాథం అని చెప్పానే ఈయనే కడప సర్వేట్రెయినింగ్‌లో నా రూమ్మేటు!" అంటున్న మాటలు వినిపించి తిరిగి చూశాను.

నారాయణరావు, అతని భార్య నిలుచుని వున్నారు.

"నమస్కారం అన్నయ్యా!" అందామె నవ్వుతూ.

నేను ప్రతి నమస్కారం చేస్తూనే గమనించానామెను. తెల్లటి వళ్ళూ, కళకళలాడే మొహం... చెంగావిరంగు చీర కట్టుకుని వుంది. నవ్వినపుడు చిన్నవయిన కోలకళ్ళూ, తెల్లటి పలువరుసా ఆమె నిర్మలత్వాన్ని చాటి చెబుతున్నాయి.

"ఈమె నా భా..." అంటూ నారాయణరావు చెబుతోంటే– "భలేవాడివే ఆ మాత్రం తెలుసుకోలేనూ" అన్నాను నవ్వేస్తూ–

వాళ్ళిద్దరూ నవ్వేశారు.

'వీళ్ళిద్దరేనా పిల్లలూ!" అన్నాను తల్లి కుచ్చిళ్ళు చెరోవైపు పట్టుకున్న బుడతల్ని చూసి.

"ఇద్దరు చాలరా మా బోటివాళ్ళకి" అన్నాడతను.

"మీ పేర్లు చెప్పండి నాన్నలూ!" అంటూ దగ్గరకి తీసుకున్నాను బుడతల్ని.

"అనిత...సునిత" అంటూ ముద్దుగా చెప్పారు.

నారాయణరావు ఎంత అదృష్టవంతుడో అతని భార్యా, పిల్లల్ని చూసి చెప్పొచ్చు.

ఆవేళ నాకోసమే ఆఫీసుకి సెలవు పెట్టినట్టు చెప్పాడు నారాయణరావు.

నేను ఎందుకు తిరుపతికి వచ్చిందీ చెప్పాను... చాలా సంతోషపడ్డాడతను. కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకోదలచిన విషయం చెప్పాను– "నాకు తెలుసు నువ్వు కట్నం తీసుకోవని... నీతో 45 రోజులు కాపురం చేశానుకదా అంతమాత్రం అంచనా వేయలేనూ!" అన్నాడు అభినందనపూర్వకంగా నవ్వుతూ.

మధ్యాహ్నం భోజనాలు అయ్యాక మామయ్య ఇంటికి తనూ వస్తానన్నాడు!

మా ట్రెయినింగ్ విశేషాలు వేపు మళ్ళింది మా టాపిక్– అందులో ఎంతమంది పాసయిందీ, ఫెయిలయింది చెప్పుకున్నాం.

ఇంతలో – మసాలా వాసన నా నాసికారంధ్రాలకి సోకింది. నేను ఎక్కడయినా నిగ్రహించుకోగలనుగానీ, ఇలా మసాలా వాసన వస్తే మటుకు నిగ్రహించుకోలేను. వెంటనే ఏ నాన్‌వెజ్ హోటల్లోకో దూరేసి చికెనో మటనో... తినేసేవరకూ నా మనసుకు ఊరట కలగదు.

"పలావా?! "అడిగాను" నిజానికి 'కోడి పలావా?' అంటూ హాస్యంగా అడగాలని వుంది. ఒకవేళ అతను నన్ను అర్థం చేసుకున్నా అతని భార్య వింటే ఏమనుకుంటుందో అని భయం. ఈ బ్రాహ్మణ స్త్రీలు ఏ జన్మకి ఎదుగుతారో కదా అని దిగులేస్తుంది... కాబోయే నా భార్యని తలుచుకుంటే మరీను.

"అవును చికెన్ పలావ్!" అంటూ నవ్వాడు. హాస్యంతో బాణం వేసినట్టు అనిపించింది నాకు.

"కొత్తగా అలవాటు చేసుకున్నావా?" అంటూ నేను తిరుగు బాణం వేశాను–ఆ నవ్వుకి తగిలేలా.

"నేనెప్పుడూ శాకాహారినే కదా!" అన్నాడు నా బాణం నుంచీ తప్పుకుంటూ. అతని తీరు చూస్తుంటే నవ్వుతూనే నన్ను మాంసాహారిగా దెప్పి పొడిచేలా వున్నాడు. ఆ దెప్పిపొడుపు అతని భార్య ఎక్కడ వంటుందోనని నా భయం! అందుకే మాట మారుస్తూ–

"సాయంత్రం ఏదయినా సినిమాకు వెళదామా" అన్నాను.

'బాగుంది నీ కథ–పొయ్యేది పెళ్ళి చూపులకి సినిమాకు వెళ్ళాలని పాడు ఆలోచనలు ఒకటి చాల్లే రేపు వెళ్ళొచ్చుగా" అన్నాడు.

మసాలా వాసన ఇంతై, అంతై నా నిగ్రహాన్ని మొత్తం కొల్లగొట్టి నాన్‌వెజ్ హోటల్‌కి పరిగెత్తించేట్టుగా వుంది. అయితే మిత్రుడి ఆతిథ్యాన్ని స్వీకరించడంకోసం శాకాహారాన్ని తినాల్సివస్తోందికదా అని ఒకటే బాధ!

మాటలు ఆపేసి డైలీ పేపర్లో తల దూర్చేసి అతి నిగ్రహంతో చదువుతున్నాను.

"ఏమండీ రెడీ... అన్నయ్యగారూ లేయండి! భోజనానికి" అంది నారాయణరావు భార్య.

రెండు నిమిషాల్లో మొహాలు కడుక్కుని భోజనాల గదిలో కూలబడ్డాము.

నా విస్తరిని నీటితో శుద్ధిచేసి వుంచుకున్నాను.

మొదట నాకు వడ్డిస్తోందామె.

నా విస్తట్లో–చికెన్ పలావ్!!!

షాక్ తిన్నాను. అనుమానంగా ముక్కల్ని మునివేళ్ళతో తడిమి ఆమెవైపు చూశాను. ఏమీ ఎరగనట్టుగా వడ్డిస్తోందామె నారాయణరావుకి. అతని విస్తట్లో పప్పు అన్నం వున్నాయి.

నారాయణరావు నా వేపు చూడ్డంలేదు.

"ఇదేమిటి నారాయణరావ్!" అన్నాను కంగారుగా.

"అది కోడిపలావ్... ఇంకా కోడికూర వడ్డిస్తుంది ఆత్రపడకు!" అన్నాడు అతి మామూలుగా.

"నారాయణరావు! ఇదికలా! నిజమా!" అన్నాను.

నా క్రింద భూమి కదిలిపోతున్న ఫీలింగు తల దిమ్మెక్కిపోతోంది!

"నిజమే విశ్వనాథం... నీకిష్టమని పొద్దున్నే కోడి మాంసం తెప్పించి చేయించాను" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"ఆమెలా చేసిందీ అసహ్యించుకోకుండా... ఎలా వడ్డించగలుగుతోందీ, బ్రాహ్మణస్త్రీ అయి వుండీ... అప్రయత్నంగా అన్నాను.

"ఆమె బ్రాహ్మణ స్త్రీ అని ఎవరు చెప్పారు" అని అన్నాడు.

"మరి?" అన్నాను కంగారుగానే.

"హరిజన అమ్మాయి."